# పార్టీలు మారే వారిని ప్రజలు నిలదీయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- 119 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారుకు కల్యాణ లక్ష్మీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, అక్టోబర్ 15: అధికార దాహంతో పార్టీలు మారే నాయకులను ప్రజలు నిలదీయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన 119 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెండ్లికి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని కల్యాణలక్ష్మీ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. దళారుల ప్రమేయం ఉండకూడదనే కల్యాణలక్ష్మీ డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చెక్కులను వారి పేరుతోనే అందించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కొంతమంది కల్యాణలక్ష్మీ చెక్కులు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, వారిని చెంపదెబ్బ కొట్టి మా ఎమ్మెల్యే కొట్టమన్నాడని చెప్పాలని సూచించారు. కొంతమంది ఎమ్మెల్యేలు, నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారారని ఆరోపించారు. పార్టీలు మారిన వారు ప్రజా సేవ కోసం మారితే ఇప్పటి వరకు ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. పదవులు, డబ్బుల కోసం పార్టీలు మారే నైజం తనది కాదని, ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేశ్, సునీల్, ఫహీమ్, సజ్జు, రఫీ, సనావొద్దీన్, అతిక్, అస్లాం, బాబా, సందయ్య, అంజయ్య, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## బతుకమ్మ వేడుకలు

మల్లాపూర్, అక్టోబర్ 15: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం గ్రామ కూడళ్లలో బతుకమ్మలను పెట్టి ఆడిపాడారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మండలంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, అక్టోబర్ 15: మండల కేంద్రానికి చెందిన పొన్నం బక్కుల తిరుపతిగౌడ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. మల్యాలకు చెందిన బొట్ల వంశీకి రోడ్డు ప్రమాదంలో గాయాలై కాలు తొలగించగా, వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మణ్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, యాగండ్ల సుమన్, ఆదిరెడ్డి, శంకర్, వంశీధర్, తిరుపతి, హరినాథ్ తదితరులున్నారు.

## కొజాగిరి పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

ధర్మపురి, అక్టోబర్ 15: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే కొజాగిరి పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాత్రి 9 గంటల నుంచి శేషప్ప కళావేదికపై కళాకారులతో హరినామస్మరణ, భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. రాత్రి 12 గంటలకు పాలల్లో చంద్ర దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 15: డీఎస్సీ అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 100 మంది స్కూల్ అసిస్టెంట్లు, 134 మంది ఎస్జీటీలు, ఏడుగురు పీఈటీలు, 31 మంది ఎల్‌పీ తెలుగు, హిందీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు బుధవారం నుంచి ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో విధులు నిర్వహించాలని సూచించారు.

## తండ్రిని చంపిన కొడుకుకు జీవిత ఖైదు

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 15: ఆస్తి విషయంలో తండ్రిని హత్య చేసిన కొడుకుకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, సీఎంఎస్ పీసీ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపెల్లి మండలం రాపెల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్యకు కొడుకులు లక్ష్మణ్, అశోక్, ముత్తయ్య, ప్రభుదాస్ ఉన్నారు. ముత్తయ్య మృతిచెందగా, లక్ష్మణ్, అశోక్ బతుకుదెరువు కోసం ముంబై వెళ్లగా, ప్రభుదాస్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. పోచయ్య తనకున్న ఆరెకరాల భూమిని ముగ్గురు కొడుకులకు సమానంగా పంచిచ్చాడు. అనంతరం అదే గ్రామంలో మరో ఎకరం భూమి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో పోచయ్యకు అప్పులు ఎక్కువ కావడంతో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి భూమి అమ్మేందుకు నిర్ణయించి, రూ. లక్ష బయానాగా తీసుకున్నాడు. విషయం తెలిసిన ప్రభుదాస్ భూమి అమ్మవద్దని అడ్డుపడుతూ తరచూ గొడవ పడేవాడు. ఇదే విషయమై 2008, నవంబర్ 23న ఉదయం తండ్రీ కొడుకులకు గొడవ జరిగింది. మాటామాట పెరిగి ప్రభుదాస్ బండరాళ్లతో తల్లి శాంతమ్మపై దాడి చేశాడు. అడ్డువచ్చిన పోచయ్యపై కర్రతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని అప్పటి సర్పంచ్ బాబు 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం పోచయ్యను అదే రోజు కరీంనగర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోచయ్య కోడలు పూల ఫిర్యాదు మేరకు గొల్లపెల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణ జరిపిన పోలీసులు చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో పోలీసులు సాక్ష్యులు, సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ప్రభుదాస్‌కు యావజ్జీవ శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి నీలిమ తీర్పునిచ్చారు. కాగా, నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులు రవీందర్‌రెడ్డి, మహేశ్‌బాబు, సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు

మల్యాల, అక్టోబర్ 15: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసిన తదుపరి లక్ష్మీ అమ్మవారు, వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించగా, అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణారావు, పర్యవేక్షకుడు హరిహరనాథ్, అర్చకులు, హైదరాబాద్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

## అధికారులకు సత్కారం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 15: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్, సీఐ వేణుగోపాల్‌కు బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, లక్ష్మి, అంకాల్ సుధాకర్, చీటి శేఖర్‌రావు, ఠాకూర్ కిశోర్‌సింగ్, మాడిశెట్టి మల్లేశం, లక్ష్మారెడ్డి, ఎడమల వెంకట్‌రెడ్డి, వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఎర్ర శ్రీనివాస్, చిత్తారి శ్రీనివాస్, నవోతు సురేశ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 15: వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రశాంత వాతావరణంలో పండుగలు జరిగేలా చర్యలు తీసుకున్న ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగోపాల్, పోలీసు అధికారులకు పోలీస్ ప్రధాన కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు మంగళవారం శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, సంఘాల నాయకుల సహకారంతోనే పండుగలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

ఎస్పీ, పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

## మాజీ మంత్రి పరామర్శ

జగిత్యాల రూరల్, అక్టోబర్ 15: అంతర్గాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ చెన్నవేణి ఎల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, మంగళవారం మాజీ మంత్రి రాజేశం గౌడ్ పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఎల్లాల రాజారెడ్డి, గొడిసెల శ్రీనివాస్, గొల్లపెల్లి ధర్మయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు గొడిసెల బాలు, సెక్రటరీ జాగిరి శ్రీనివాస్ తదితరులున్నారు.

## ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 15: మెట్‌పల్లి పట్టణ శివారులో ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాయికల్ మండలం కట్కాపూర్‌కు పెండల రాజేందర్ మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా మెట్‌పల్లి పట్టణ శివారులోని వట్టివాగు వంతెనపై డివైడర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తా పడింది. రాజేందర్‌తో పాటు ఆయన భార్య రాధ, అత్త గంగు, కూతురు శృతికి స్వల్ప గాయాలు కాగా, మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రాజేందర్ వదిన వెన్నెల గంగుకు తీవ్ర గాయాలు కాగా, జగిత్యాల దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు.

## ధర్మపురి నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, అక్టోబర్ 15: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## 18న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 15: జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో ఈ నెల 18న జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలకొక విద్యార్థి జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఈనెల 29న జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

## మాల సంఘం అధ్యక్షుడిగా ఎల్లయ్య

ఎల్లయ్య

వెల్గటూర్, అక్టోబర్ 15: కిషన్‌రావుపేట గ్రామంలో మంగళవారం మాల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా పులి ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎన్నుకున్న కుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బోగే రాజయ్య, ఎట్టం చంద్రయ్య, అల్గునూరి సతీశ్, గౌరి తిరుపతి, పులి పోచయ్య, బోగే చిన్నయ్య, గందం చంద్రయ్య, కండ్లే రాజు, బోగే సాగర్, కూస వినోద్, గౌరి సతీశ్, అల్గునూరి మల్లేశ్, బోగే లక్ష్మణ్, గౌరి వెంకటేశ్, ఎట్టం తిరుపతి, దమ్మ నల్లగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు వాలీబాల్ టోర్నమెంట్

కోరుట్ల/మేడిపల్లి, అక్టోబర్ 15: ఈ నెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని మేడిపల్లి, కోరుట్ల, కథలాపూర్ మండలాల క్రీడాకారులకు సీఐ సురేశ్‌బాబు సౌజన్యంతో కోరుట్ల వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ బారీ, వెంకటరెడ్డి, గంగాధర్, లక్ష్మీనారాయణ, అమేర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ. 8 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంఏ బారీ సెల్ నంబర్ 94400 70381, కోరుట్ల సీఐ 87126 56820, ఎస్ఐ 87126 56790, అమేర్ సెల్ నంబర్ 96037 33005లో సంప్రదించాలని కోరారు.

## బీర్‌పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

సారంగాపూర్, అక్టోబర్ 15: బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రఘుచందర్ మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ కుమారస్వామి ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల, అక్టోబర్ 15: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1998-2000 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 24 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిసిన పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్, సందీప్, నరేశ్, సంతోష్, శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.

## విప్‌ను కలిసిన రెడ్డి జన సంక్షేమ సంఘ సభ్యులు

కథలాపూర్, అక్టోబర్ 15: వేములవాడలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌ను మంగళవారం మండల రెడ్డి జన సంక్షేమ సంఘం సభ్యులు కలిశారు. దుంపేట శివారులోని వరద కాలువ భూమిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతితోపాటు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కేతిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులపై దాడి చేయడం సరికాదు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 15: కోల్‌కతాలో వైద్యురాలిపై దాడి చేయడం సరికాదని ఐఎంఏ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై దాడిని ఖండిస్తూ అక్కడి వైద్యులు చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా ఐఎంఏ కేంద్ర శాఖ పిలుపు మేరకు స్థానిక ఏరియా దవాఖానలో జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ సీనియర్ సభ్యులు భీమనాతి శంకర్, డాక్టర్ మందాడి మోహన్‌రెడ్డి, ట్రెజరర్ కోటగిరి సుధీర్‌కుమార్, మహిళా ప్రతినిధి వొడ్నాల రజిత, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బట్టపల్లికి అదనంగా ట్రిప్పులు నడపాలి

సారంగాపూర్, అక్టోబర్ 15: బట్టపల్లి నుంచి జిల్లా కేంద్రానికి ఉదయం, సాయంత్రం ఒక్కో ట్రిప్పు మాత్రమే ఆర్టీసీ బస్సు నడపడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా ట్రిప్పులు నడిపించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు గ్రామానికి చెందిన అర్రె ప్రేమానందం ఫోన్ ద్వారా సమస్యను వివరించినట్లు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

రాయికల్, అక్టోబర్ 15: రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలో డీఎస్పీ రఘుచందర్ మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. తాట్లవాయి గ్రామానికి చెందిన ఆకుల మల్లేశం, నందగిరి గోపాల్ అదే గ్రామానికి చెందిన సురేశ్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, డీఎస్పీ రఘుచందర్ గ్రామంలో విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుధీర్‌రావు తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, CH. ANJALI W/o. CHENNAMANENI RAVINDER, R/o. H.No. 1-5-197/18/5, Ravindranath Tagur Nagar, Jagitial. Telangana. Have Changed My Name as CHENNAMANENI MADHURI

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

JYOTHISHMATHI COLLEGE OF EDUCATION
RAMAKRISHNA COLONY, NUSTULAPUR.
Karimnagar-505527 Cell:9177553535
'B' CATEGORY NOTIFICATION FOR B.Ed. COURSE (2024-25)
Applications are Invited from Qualified candidates for Admission Into B.Ed.Course under category 'B' in All Subjects.
Prescribed Application Forms can be had from the College Office and the same may be submitted to the Principal on or before 21.10.2024
Sd/- Secretary & Correspondent

## నకిలీ సర్టిఫికెట్ల ఘటనపై ఎంపీడీవో విచారణ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15: నకిలీ సర్టిఫికెట్ల ఘటనపై ఇబ్రహీంపట్నంలో ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన సున్నపు పెద్ద ముత్తన్నకు గ్రామంలో ఇల్లు (నంబర్ 18-89) ఉంది. పెద్ద ముత్తన్న కొడుకు రాకేశ్ తాగుడుకు బానిసయ్యాడు. స్నేహితులతో కలిసి తండ్రి పేరు మీదున్న ఆస్తిని కాజేయ్యాలనుకున్నాడు. తండ్రి మరణించినట్లు ఫేక్ సర్టిఫికెట్లను సృష్టించి తన పేరు మీద ఓనర్ సర్టిఫికెట్ తీసుకొని ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇంటిని మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కుదవపెట్టి రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇదిలా ఉండగా రాకేశ్ కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంక్ సిబ్బంది ఇటీవల అప్పు రికవరీ కోసం రాకేశ్ ఇంటికి రాగా తండ్రి ముత్తన్న ఖంగుతిన్నాడు. సిబ్బందితో వాదనకు దిగాడు. ఇల్లు నా పేరు మీద ఉంటే అప్పు ఎలా ఇచ్చారని వాదించాడు. ఈ విషయమై ఈ నెల 2న ముత్తన్న కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. రాకేశ్ 29-11-22లో తీసుకున్న ఓనర్ షిప్ సిర్టిఫికెట్ సీరియల్ నంబర్ 304 ఉందని, ఆ ఏడాదిలో జీపీ రికార్డులో నంబర్ 108 వరకే సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తేలింది. సంతకాలకు సొంతన లేదని తెలిపారు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్ గ్రామపంచాయతీకి సంబంధించినది కాదన్నారు. కార్యదర్శి రామకృష్ణ, ముత్తన్న వాంగ్మూలాన్ని తీసుకొని నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

పెగడపల్లి/జగిత్యాల రూరల్/మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 15: పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామంలో మంగళవారం బర్రెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల, వెటర్నరీ అసిస్టెంట్ మతిన్, సిబ్బంది వినీత్, జానీపాషా, నర్సయ్య, తిరుపతి, మాజీ సర్పంచ్ కొండయ్య, రైతు సంఘం నాయకుడు మూల రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో సుమారు 290 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి నరేశ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మిర్యాల నాగేందర్ రెడ్డి, అలిగేటి రవీందర్, కట్కం రమేశ్, షేక్ హమ్మద్, తలారి బక్కయ్య, కాలగిరి నర్సరెడ్డి, వేణురావు, తిరుపతి, మధు, రాకేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల, చౌలమద్ది గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి మనీషాపటేల్ తెలిపారు.

## యాదవ సంఘ సభ్యులపై కేసు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 15: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన పలువురు యాదవ సంఘ సభ్యులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మాజీ ఉపసర్పంచ్ చిలివేరి దిలీప్‌గౌడ్ ఇంటికిపైకి ఈనెల 10న యాదవ సంఘ సభ్యులు పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని దాడి చేసేందుకు వెళ్లగా, ఆయన కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దిలీప్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఐదుగురు యాదవ సంఘ సభ్యులతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పుస్తకావిష్కరణ

జగిత్యాల, అక్టోబర్ 15: జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు డాక్టర్ నీలి వాసవి రాసిన 'నిజామాబాద్ భూగర్భజలాలు, నేలపై ఘన వ్యర్థాలు, లీకేట్ ప్రభావం, స్థిరమైన నిర్వహణకు మార్గాలు' పరిశోధక పుస్తకాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ ఆవిష్కరించారు. వాసవిని ఉప ప్రధానాచార్యుడు చంద్రయ్య, పరీక్షల నియంత్రణాధికారి ప్రమోద్‌కుమార్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి వరప్రసాద్, రాంచంద్రం, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుజాత, ఎంఏ రహీమ్, శ్రీలత, జమున, సునీత, జ్యోత్స్న, అధ్యాపకులు అభినందించారు.

## పాఠశాలలో ఆకతాయిల బీభత్సం

రాయికల్, అక్టోబర్ 15: రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు బీభత్సం సృష్టించారు. పాఠశాల ఆవరణలో మద్యం సేవించి, తరగతి గదుల్లో 8 ప్యాన్లు, బెంచీలు, తలుపులను ధ్వంసం చేశారు. కాగా, మంగళవారం ఉదయం పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా, విచ